బాబోయ్.. బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

- ఇటీవల అర్ధరాత్రి దూర ప్రాంతం నుంచి బస్సులో దిగి బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన ఓ ప్రయాణికుడు ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు, పూటుగా మద్యం తాగి అతడ్ని భయపెట్టి, రూ. 2,800 లాక్కుని అక్కడ నుంచి పారిపోయారు.
- కొద్ది రోజుల కిందట రైతుబజారు వద్ద ఆకు కూరలు అమ్ముకునే మహిళ వెంటబడి.. ఆమెను ఇబ్బందులకు గురి చేశారు.
- గత కొద్ది రోజుల కిందట ఓ మహిళ ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన ఒక వ్యక్తిని, కొంత మంది వ్యక్తులతో కలసి మాయ చేసింది. కాకాని రోడ్డులోకి తీసుకెళ్లి అతడ్ని కొట్టి డబ్బులు, సెల్ ఫోన్ లాక్కుని వెళ్లి పోయారు.
- ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక వృద్ధుడిని బ్లేడ్ బ్యాచ్ గొంతు కోసి, అతని వద్ద డబ్బులు లాక్కుని వెళ్లిపోయిన సంఘటన గుంటూరులో ఒకప్పుడు కలకలం రేపింది.
- బస్టాండ్‌లో ఆటో ఎక్కి మహిళను ఆటోనగర్ వద్ద ఎక్కిన వ్యక్తులు ఆమెను భయపెట్టి పర్సు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిన ఘటనలో నిందితుల్ని గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటువంటి ఘటనలు ఇటీవల నగరంలో పెరిపోతున్న పరిస్థితులు కనపడుతున్నాయి.

- ఆర్టీసీ బస్టాండ్ వద్ద పలు ఘటనలు
- అర్ధరాత్రి పూట దాడులు
- భీతిల్లుతున్న నగర ప్రజలు



పట్నంబజారు: నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువకులు ఒక గ్రూపుగా ఏర్పడి.. ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఒక బార్ వద్ద, బస్టాండ్ ఎదురుగా వైన్స్‌ల వద్ద కాపలా కాస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని గుర్తించి, నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకుని వెళ్లి భయపెట్టి డబ్బులు గుంజుకుంటున్నారు.

బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్‌ను అడ్డాగా చేసుకుని, నిత్యం మద్యం తాగడం బ్లేడ్ బ్యాచ్‌కు పరిపాటిగా మారింది. కొత్తపేట, పాత గుంటూరు పోలీసుస్టేషన్ల పరిధిలోనే వీరు అధికంగా ఉంటున్నారని తెలుస్తోంది. సాయంత్రం 7గంటల నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారిని భయపెట్టడం.. డబ్బులు లాక్కోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. కేవలం మద్యం, గంజాయికి బానిసలుగా మారే.. ఇటువంటి ఆగడాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది.

ఓవర్ బ్రిడ్జిల కింద కూడా దాడులు

నగరంలోని అరండల్‌పేట, మణిపురం, కంకరగుంట ఓవర్ బ్రిడ్జిల వద్ద సైతం బ్లేడు బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. గతంలో అరండల్‌పేట ఓవర్ బ్రిడ్జి కింద ఒక వ్యక్తిపై బ్లేడు బ్యాచ్ దాడి చేసి.. డబ్బులు లాక్కుని పరారైన సంఘటన ఉంది. అయితే, గతంలో జిల్లా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి నిలువరించిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు హల్‌చల్ సృష్టిస్తున్నారని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వ్యాపారులు చెబుతున్నారు.

మాయ చేసి.. చావకొట్టి దోపిడీ

ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో కొంత మంది వ్యభిచారులు నేరుగా రోడ్లపైనే ఉంటున్న దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల వ్యక్తులు, కార్మికులను టార్గెట్ చేసి వల వేస్తారు. ముందుగానే ఆటోలో వారి వ్యక్తుల్ని సెట్ చేసుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి, చావకొట్టి డబ్బులు లాక్కుంటున్నారు. ఇటువంటి విషయాల్లో కేసులు పెడితే తమ పరువు పోతుందని భావించిన వ్యక్తులు ఒకరిద్దరూ తప్ప.. స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేసిన పరిస్థితులు లేకుండా పోయాయి.

అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

బస్టాండ్ ఎదురుగా బార్ అండ్ రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. అర్ధరాత్రి రెండు గంటల వరకు కూడా మద్యం అమ్ముతున్న పరిస్థితులు ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. బ్లేడ్ బ్యాచ్‌లు పూటుగా మద్యం తాగి ఆగడాలు చేస్తున్నారు. కొత్తపేట పీఎస్ పోలీసులకు స్పష్టంగా బార్లు తెరిచి ఉంటున్నాయని తెలిసిననప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా పోలీసు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై చర్యలు తీసుకుంటాం. అయితే ఇప్పటి వరకు ఫిర్యాదుదారులు రాలేదు. రాత్రి వేళల్లో బార్‌లు కూడా నిబంధనలకు అనుగుణంగా మూయిస్తున్నాం. ఇప్పటికే సిబ్బందితో సాయంత్రం, రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ఎటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– కొత్తపేట, పాత గుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌వోలు షేక్ అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

గుండవరం(చేబ్రోలు): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయ్యింది. వివరాల మేరకు.. గుండవరానికి చెందిన నల్లప్రోతు అనూషను ఎనిమిదేళ్ల క్రితం గుంటూరుకు చెందిన రవి అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యసనాలకు అలవాటుపడిన రవి తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు భార్య అనూష ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన గుర్రపుశాల సల్మా (37) శుక్రవారం రాత్రి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన సల్మాను ఎనిమిదేళ్ల క్రితం పొన్నూరు ప్రాంతానికి చెందిన గుర్రపుశాల నవీన్ కులాంతర వివాహం చేసుకున్నారు. నవీన్ స్థానికంగా రేషన్ వాహనం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య వివాదం జరుగుతున్న నేపథ్యంలో భార్య సల్మా శుక్రవారం ఇంటిలో అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలు పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి కుమార్తె ఉంది. పట్టణ సీఐ బాబీ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దెందుకూరి లక్ష్మీ శ్రీనివాస్‌కు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. '' ఎ నావల్ ఫీచర్ సెట్ ఎక్స్‌ట్రాక్షన్ ఫర్ అనాలసిస్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఎమోషనల్ స్పీచ్ సిగ్నల్స్'' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన దెందుకూరి లక్ష్మీశ్రీనివాస్‌ను ఆయా విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరాలని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హిందీ భాష పట్ల అవగాహన పెంచుకుంటే భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా జీవించవచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు సరోజిని మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను సర్టిఫికెట్లను అందించి, సన్మానించినట్లు తెలిపారు. హిందీ అధ్యాపకురాలు శాలిబాయి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): తోటివారికి సాయం చేయడం దైవ కార్యంతో సమానమని ఆదర్శ్ ఎం.జోసఫ్ దిలీప్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో పునీత శౌరి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు, విద్యార్థుల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయం అందించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేరీ జోస్పిన్ మాట్లాడుతూ దాతలు పాఠశాలకు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం దాతలు ఆకుల ఆకాష్, ఎ.శంకర్‌నాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్, ఎస్.థామస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు – రమణ – బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం 'కవి మిత్రుల సంగమం–కవి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు సంఘం స్టేట్ కో– ఆర్డినేటర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'మా గణపవరం కథలు' పుస్తక సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో కవులంతా పాల్గొని కవితల్ని వినిపించాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ గొల్ల షీభారాణి మృతి

తెనాలిఅర్బన్: గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ గొల్ల షీభారాణి (60) గురువారం మరణించారు. ఈమె భర్త మాణిక్యరావు పులిచింతల ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరికి ఇద్దరు సంతానం. షీభారాణి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా 1983లో కావూరులో బాధ్యలు స్వీకరించారు. అనంతరం ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని నిర్మల్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో ప్రిన్సిపల్‌గా పనిచేశారు. మహబూబ్ నగర్‌లోని రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపల్‌గా కూడా పనిచేశారు. అకాడమిక్ గైడెన్స్ అధికారిగా పదోన్నతి పొంది నల్గొండలో పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. ఆమె భౌతిక కాయాన్ని తెనాలి చినరావూరు తోటలోని వారి నివాసం వద్ద ఉంచారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె భర్త మాణిక్యరావు తెలిపారు.

కేజీ టమాటా రూ.50లకే..

తెనాలిఅర్బన్: టమాటా ధరలు ఆకాశానికి అంటుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటిని రైతు బజారుల్లో సబ్సిడీపై విక్రయించేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా కొద్ది రోజుల నుంచి కేజీ రూ.50 కే విక్రయాలు ప్రారంభించింది. ప్రతిరోజు పట్టణంలోని పలు రైతు బజారుల్లో వీటిని విక్రయిస్తున్నారు. ప్రజలు శుక్రవారం బుర్రిపాలెం రోడ్డులోని రైతు బజారులో టమోటాల కోసం ఇలా బారులు తీరి కన్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఎంపీపీ శ్రీనివాసరావు

కొండపాటూరు(కాకుమాను): గ్రామ ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని కొండపాటూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు 99 శాతం ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించి నట్లు తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని, గంటల వ్యవధిలోనే పరిష్కరించి, సర్టిఫికెట్‌లను సకాలంలో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామేశ్వరి, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, రామినేని తిరుపతయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ వలంటీర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కొమ్మూరులో 'జగనన్న సురక్ష'

కాకుమాను: కొమ్మూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో గ్రామ ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్‌లను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

చిప్స్ కళాశాలకు ఔషధ పరిశీలన ప్రయోగశాలగా గుర్తింపు



అనుమతి పత్రాలు చూపుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర్

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ కళాశాలకు ఔషధ పరిశీలన ప్రయోగశాలగా గుర్తింపు మంజూరు చేసినట్లు చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఆయన వివరాలు వెల్లడించారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలకు డ్రగ్ అనాలసిస్ ల్యాబ్‌ను, అత్యాధునిక ఔషధ విశ్లేషణ పరికరాలను పరిశీలించడంతోపాటు, ప్రయోగశాలలో డ్రగ్ అనలిస్టులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కళాశాల సిబ్బందికి అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. ఫార్మా రంగంలో తయారయ్యే ఏ విధమైన ఔషధాన్ని అయినా.. డోసేజ్‌ను కానీ అదేవిధంగా చెలామణిలో ఉన్న ఔషధాల కెమికల్ సబ్ స్టాన్సెన్ నైనా విశ్లేషణాత్మకంగా తెలుసుకునే వీలు ఈ ల్యాబ్ ద్వారా సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఏపీ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ ఉన్నారు.

మృతుని కుటుంబానికి సజ్జల భార్గవ్ పరామర్శ



వసురాజు తల్లిదండ్రులను పరామర్శిస్తున్న భార్గవరెడ్డి, దయాసాగర్

గరికపాడు(కాకుమాను): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గరికపాడుకు చెందిన సోషల్ మీడియా మండల కన్వీనర్ వసురాజు తల్లిదండ్రులను శుక్రవారం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవరెడ్డి, మచిలీపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేసిన వసురాజు కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వసురాజు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, డాక్టర్ అసదుల్లా, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ మేరిగల రవిబాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, మేకా వెంకటరామిరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి పలు మండలాల కన్వీనర్లు ఉన్నారు.

'డైట్'లో నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్



ఆసుపత్రిలో గోడలపై స్టిక్కర్లు తొలగిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ డైట్ క్యాంటీన్‌లో వైద్యులకు సరిపడా భోజనం వండించాలని, లోపల అపరిశుభ్ర వాతావరణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని డైట్ క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. వైద్యులకు సరిపడా ఆహారం అందించడం లేదని, డ్యూటీ వైద్యులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. పీజీ వైద్య విద్యార్థులు సైతం డైట్ క్యాంటీన్‌పై ఫిర్యాదు చేశారు. డ్యూటీ డాక్టర్లకు తప్పనిసరిగా నాణ్యమైన భోజనం అందించాలని ఆయన నిర్వాహకులకు స్పష్టం చేశారు. మెను ప్రకారం వైద్యులకు భోజనం అందించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆసుపత్రి గోడలపై స్టిక్కర్లు అంటిస్తే సహించం

జీజీహెచ్ క్యాజువాల్టీ గోడలపై స్టిక్కర్లు అంటించడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తనిఖీల్లో గోడలపై స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించినా శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో కోపగించుకున్నారు. స్వయంగా కొన్నింటిని తొలగించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సరిఫికెట్ల పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలిలోని 22వ ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయంలో శుక్రవారం గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులుగా శిక్షణ పూర్తి చేసిన పలువురికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. కమాండెంట్ అధికారి ఎ ఉమాశంకర్, చీఫ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అధికారులు కె.బిక్షాలు, కె స్వామి, షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద నాణ్యత పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: మణిపురంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా కేటాయింపులు చేస్తున్న దృష్ట్యా, విద్యార్థులకు పరిశుభ్రమైన, బలవర్ధకమైన ఆహార పదార్థాల్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం జిలానీ బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని మహిళాలోకం చాటి చెప్పింది. ఆసియాలోనే అతి పెద్దదైన మార్కెట్ యార్డు కమిటీలో మహిళలకు ప్రాధాన్యత కల్పించడంపై హర్షం వ్యక్తం చేసింది. వైఎస్సార్ సీపీ మహిళా నేతలు శుక్రవారం బ్రాడీపేటలో సీఎం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీరాణి, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొప్పుల విజయమాధవి మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ, పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అన్ని అంశాల్లో అగ్రతాంబూలం ఇస్తూ, వారికి సోదరుడిగా తానున్నాననే భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలోనూ తొలి నుంచి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతోందని వివరించారు. అనంతరం మిర్చి యార్డు డైరెక్టర్‌గా నియమితులైన కొప్పుల విజయమాధవిని శాలువాతో సత్కరించి, చీర బహూకరించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు ఈవూరి వనజాక్షి, మల్లెల సత్యవతి, రత్నకుమారి, ఖైరూన్, శిరీష, అనూష, శ్రావణి, షేక్ జిలాని పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రొక్లెయిన్‌తో పూడిక తీత పనులు

చేబ్రోలు: చేబ్రోలులు మండల కేంద్రంలోని మసీదు పేట, గొడపాలెం ప్రాంతాలకు చెందిన ప్రజలు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఇటీవల పర్యటనలో.. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలకు ముంపుబారిన పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న మురుగు, వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే కాలువ పూడికతీత లేకపోవడంతో సమస్య ఉత్పన్నమైనట్లు వెల్లడించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కిలారి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమస్య పరిష్కారానికి ఆదేశించారు. శుక్రవారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. గొడపాలెం, మసీదుపేట ప్రాంతాల్లో ప్రొక్లెయిన్ సహాయంతో మురుగునీటి కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. కాలువలోని పిచ్చిమొక్కలు, తుంగ, చెత్తాచెదారం తొలగించారు. చేబ్రోలులోని జమ్ములదొడ్డి వెనుక భాగంలోని సంగం ప్రాంతం నుంచి గొడపాలెం, మసీదుపేట మీదుగా నల్లచెరువులోకి కలుపుతూ మురుగునీటి కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు.

నిరంతర వర్షాలతో అప్రమత్తత అవసరం

నెహ్రూనగర్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వర్షా కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నేపథ్యంలో అధికారులు, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత సచివాలయం కార్యదర్శులతో తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యల్ని గుర్తించాలని చెప్పారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని ఆదేశించారు. గాలుల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినా, తాగు నీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా పంపింగ్ కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత ఏఈ, డీఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీద ఎక్కడైనా చెట్లు పడితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. నగర ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబర్‌కి కాల్ చేయవచ్చని ఆమె సూచించారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి పాటుపడాలి: మేయర్



మేయర్ కావటిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డు డైరెక్టర్లు

నెహ్రూనగర్: వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి, రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు సూచించారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకమండలికి డైరెక్టర్స్‌గాఎంపికైన పాతకుంటి సుశీల, బొందలపాటి వెంకటేశ్వరరావు, గుడివాడ అరుణ శుక్రవారం నగర మేయర్‌ను సంపత్ నగర్‌లోనిక్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, బోకేతో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, బాలవెంకటరెడ్డి, బొందలపాటి భాస్కరరావు, భాస్కర్, గ్రంధి హనుమంతరావు, రఘు పాల్గొన్నారు.

భావి ఉపాధ్యాయులుగా రాణించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ విద్య అభ్యశిస్తున్న విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణతో భావి ఉపాధ్యాయులుగా రాణించాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కళాశాలలో శుక్రవారం 2022–24 బ్యాచ్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యకు ప్రాముఖ్యత ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా భావి ఉపాధ్యాయులుగా ఎదిగే బీఈడీ విద్యార్థులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మోటూరి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్‌లో డిపాజిట్ క్యాంప్ ప్రారంభం



నగరంపాలెం: రెప్కో బ్యాంక్ (భారత ప్రభుత్వ సంస్థ) గుంటూరు శాఖలో ఈనెల 21 నుంచి ఆగస్టు 31 వరకు డిపాజిట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎ.లక్ష్మీబాయ్ పేర్కొన్నారు. నగరంలోని బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం డిపాజిట్ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంప్‌లో 'రెప్కో– 400' అనే నూతన డిపాజిట్ పథకం ద్వారా 400 రోజులకు సాధారణ డిపాజిటర్లకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థిరాస్తిపై కూడా తనఖా రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0863-2331775, 9490754934 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com